# నేల... తల్లి

— ఎ. అప్పల్నాయుడు

చీకటి - ఊరి అంతట్నీ చుట్టుముట్టింది.

ఇళ్ళల్లో కిరోసిన్ బుడ్డీల వెలుగు చీకటితో పోరుజేస్తోంది

ఊరిమొగానున్న సూరిబాబు డాబా యింటి విద్యుద్దీపాలుమాత్రం ఆ యింటిలో నేగాక. యింటి ఎదుటివీధి జాగాలోవి చీకట్నిగూడా తరిమే శాయి. ఆ డాబా ముందటివీధి జాగా వెలుగులో కొంతమంది పిల్లలుజేరి 'దొంగాట' ఆడుతున్నారు.

మే నెలాఖరి రోజులు. అమావాస్య చీకటి రాత్రులవి. ఊరి వెలుపలి పొలాలమీదుగా గాలి చల్లగా తగుల్తోంటే.... ఊరి మొగానున్న ఆ డాబా ముందరి అరుగులమీద చేరారు కొంతమంది పెద్దలు. అరుగుల మీద కూర్చొని పిచ్చాపాటి కబుర్లాడుకోవటమో పిల్లల ఆటకు ఉచిత సలహాలివ్వటమో చేస్తున్నారు పెద్దలు.

కొద్దిసేపటికి ఆకాశంలో మబ్బులు కమ్మాయి. ఎక్కడో మెరుపు మెరిసింది. ఇంతలో గాలికూడ ఎక్కువయ్యింది.

పెద్దలు - వర్షమొస్తాదిగావాల వాస్పం - అనుకుంటూ అక్కడ్నించి లేచారు. అప్పుడే కరెంటుకూడా పోయింది.

"కరెంటుపోయీ చీకటొచ్చే.... గాలీపోయి వానా వచ్చే
పారీపొండి పారీపొండి .. ఎక్కడి దొంగలక్కడికే గుప్‌చిప్"

అని పాడుకుంటూ పిల్లలు పరుగందుకున్నారు యిళ్ళకు.

చీకటి తోటలో నుయ్యిలా సూరిబాబు డాబా చీకటిలో మునిగి పోయింది! సూరిబాబు డాబాకి మూడిళ్ళవతల గల పూరింటి ముంజూరు దగ్గర "దబ్ దబ్ దబ్....దబా" అనే దరువులూ; "అమ్మో ఓలమ్మో! సచ్చాన్రో...." అనే అరుపులూ విన్పించాయి.

ఆకాశంలో పెద్దగా మెరుపూ, పేద్ద ఉరుమూ...

ఇళ్ళకు పారిపోతున్న పిల్లలు మెరుపుకి కళ్ళుమూస్ని. ఉరుము శబ్దానికి గుండెలదరగా 'తుప్‌తుప్'మని గుండెలమీద తుంపరలు ఉమ్ముకున్నారు

చీకటిలో.... చింతచెట్టుమీది పాలపిట్ట ఎవరికోసమో యేడుస్తోంది! దానితోపాటుగా, దబ్‌దబా దరువులూ ... సచ్చాన్రో ఏడుపులూ విన్పించాయి పిల్లలంతా ఆ యింటి ముంజూరువైపు వెళ్ళారు.

ఆ దరువులు— గన్నియ్య తన తల్లి వీపుమీద వేసిన దెబ్బలు. ఆ అరుపులు ఆ ముసలితల్లి బాధతో వేస్తున్న కేకలు!

ఆ తల్లికి రెండో మూడో యేళ్ళు తక్కువుంటాయి అరవైకి. కానీ ఆమె శరీరంకి కండలుకంటే ఎముకలే ఎక్కువుంటాయి. ఆ ఎముకల మీది చర్మం.... చీరకంటే ఎక్కువ మడతలు పడివుంటుంది. తలమీది జుత్తు మొహంకంటే ఎక్కువ. ఆమెకి తిండి చాలక ఆకలి ఎక్కువ. ఆవయ్యేళ్ళ జీవితంలో ఆనందంగా గడిపిన క్షణాలుమాత్రం తక్కువ. ఇక బతికే కాలమూ తక్కువే!

ఆమె బతికే ఆ కొద్దికాలందాకా అయినా, ఆమె పోషణ భారం వహిస్తున్నందుకు.... గన్నియ్య అదో ఘనకార్యంలా భావిస్తాడు.

" యిదేటి సోద్దో, తవ్విదో కూర్జేసి తెస్తందేటి? ఇంటిల గూకొని తిన్దమేకదా! నాకేటిగాదెల్లంట నిల్వలున్నాయా? నానూ కూల్నాలీ జెయ్యాల. మా యన్నలాగ నేనూ వొదిలేత్తే.... యీదులంట అల్లా అయ్యోరమ్మలాగ అడుక్కుడినాల! కనీ, పెంచిన తల్లే ... కాదా? ఈ కరువు కాలిసెత్తందిగానీ .. అపాటి తిండెట్టలేమా? మా కుటమాం మని సౌక మద్ద వొదిలేత్తే దానికి సాల్లు." అని అంటూ వుంటాడు గన్నియ్య అందరితో.

గన్నియ్య అన్న పేరు కన్నయ్య పట్నం హైస్కూల్లో బంట్రోతు బంట్రోతుకి జీతం తక్కువ కుటుంబ భారం ఎక్కువ. తల్లిని కొన్నాళ్ళు తనదగ్గరా, కొన్నాళ్ళు తమ్ముడిదగ్గరా వుంచాలి —అనే ఒప్పందంతో కొన్నాళ్ళు తల్లి పోషణభారాన్ని వహించాడు.

అయితే, పిల్లల చదువులూ, భార్య జబ్బులూ బంట్రోతు కన్నయ్యని అప్పుల్లో ముంచేసినాయి. ఇంతలో పెద్ద కూతురు పుష్పవతి అయ్యింది. ఆ శుభకార్యం జరపటానికి ఎవ్వరూ అప్పివ్వకపోతే— అప్పుడు తల్లి చెవుల్ని చూశాడు. కొన చెవి కమ్మలు - రెండు చెవుల్లో నాలుగు కన్పించాయి. నాలుగింటిలో రెండు తనఖాకి వెళ్ళగా.... శుభకార్యం జరిగింది. తల్లి ఆనాటినుంచి కొడుకు చెవిలో ఇళ్ళుగట్టి చెప్పింది—

"నాయినా! యీ బంగారం పిసర నా కన్నోరెట్టింది మీ అయ్య! సీనూ ఎన్ని బదవలు పడినా .. యీ బంగారాన్ని నిలుపుకున్నాం. దీనూసు పట్టలేదు యీ పేణం పోయిందాకైనా యీ బంగారమూసు. అక్కడి మదిసెక్క ఊసు పిరు ఎత్తొద్దు పోగొట్టుకోడం సులువుగానీ, కూడెట్టడం కస్టం. పోని మీరు కూడబెట్టకపోయినా, వున్నిది నిలబెట్టండి ..." అని బతిమాలింది తల్లి.

కమ్మలు తనఖా విడిపిద్దామనుకున్న కొడుకు.... మరి రెండేళ్ళకు కూతురి పెళ్ళికి యేకంగా ఆ రెంటినీ అమ్మేశాడు. ఇక అక్కడ వుంటే ఆ వున్న రెండు చెవులికీ ప్రమాదమని.... ఆ తల్లి చిన్న కొడుకింటికి చేరింది అప్పట్నించి, చిన్నకొడుకు పోసిన గెంజి తాగుతూ రోజులు గడిపేస్తోంది.

ఇంటి ముంజూరు గడపలో చతికిలబడింది ముసిల్ది ... యేడుస్తూ! ఒంటిమీది కోక పైటకొంగు భుజాలు జారి నేలను పడింది. వాసాలకి పట్టిన బూజుల్లో పట్టుల్లా ఆమె ఎముకలగూడు గుండెమీద ఎండిన స్తనాలు వేలాడుతున్నాయి. కొప్పు ముడివీడి ... తలవెంట్రుకలు - కూలిన చెట్టుకొమ్మల్లా మొహాన్ని కప్పేశాయి. ఒణికే చేతుల్తో నెత్తీనోరూ కొట్టుకుంటూ.... గెంజివార్పు దాకలోపడ్డ కోడిపిల్లలా మొర్రోమంటోంది.

పిల్లలంతా పరుగున వచ్చి చుట్టూ చేరారు ఇరుగూ పొరుగూ గన్నియ్యని ముసిల్దాన్నుంచి దూరంగా లాక్కుపోయారు.

"నువ్వేటి మనిసివా? పశివ్విరా? కన్నతల్లే కాదురా? కటికోడి (కసాయోడు)లాగ కొట్టడంకి చేతులెలాగొచ్చాయిరా?" అని కోప్పడ్డాడు గన్నియ్యని - పొరుగింటి ముదరోడు.

"అందరూ మమ్మల్నసీవోల్లే సీను ముందునుంచే అంతన్న.... ముసిల్దానూసు పట్టకూ అని! అదేటి చిన్నింటిదాయికాదు; ఈదిల ఈరంగ మేత్తాదని!! యిన్నాడు కాదా మనిసి." అని పెనిమిటికీ. అక్కడ చేరిన యిరుగూ పొరుగువారికీ అన్నట్టుగా అంది గన్నియ్య భార్య నరస.

"నీ మాటలినే అలగ తయారైనాడే అడు ఒలే? యేడుత్తావు లేయే. యేడుత్తావు. నాకంటా యెక్కువేడుత్తావు. నా యేడుపాట్టినేపోదు. నీకు సుడతాదిలే .." చేతి మొటిమలిరుస్తూ అంది ముసల్ది కోడలి మాటకి జవాబుగా.

"నా తిండిదిని నాకే శాపనార్థాలెడతావే గతిలేన్దానా? నీకందికే గుద్దినాడు గుద్దులు..." అని ఎడమ అరచేయిమీద కుడిచేతి పిడికిల్తో గుద్ది చూపుతూ, ముసిల్దాని మీదకొస్తూ పలికింది కోడలు.

"నీ తిండేటే ... నీ తిండి? నీ కన్నోరింటికాంచి మోసుకొచ్చి నావే? నీ తిండంతన్నావు. తెచ్చిందిది సారె. నాకెడతంది! బారెడూ కన్నోరి సారె! ఓలమ్మ సాల్లేయే! ఎవులెరగరు దీని తిండట. దీనితిండి. తాగడనికి గలాసిచ్చినారె? గెంజె దోర్పటానికి తసలా యిచ్చినారె ... మీ కన్నోరు? నా గిన్నీ, నా ముంతేగదే నువ్వోడుతున్నవి .." అని చేతు లూపుతూ తిరిగి దెప్పింది ముసిల్ది.

"నా కన్నోరి సారె తెచ్చి యిచ్చుత్తే.... యేలిద్దువుగావాల యేలు బడి! అత్తరికం సేసిద్దువుగావాల! కన్నోరెట్టిన పుత్తిలతాడు నీ కొడుకు పాల బెట్నాను. సారె తెత్తాను. నీ యెదాన పోసెత్తాను.... తిందువులే. యేటి? అకరికి నీ పున్నేనా. నీ కొడుకు పున్నేనా.... నీనూ, నా పిల్లలూ అడుక్కుతింతాంనే. అప్పుడు సల్లబడతాయా నీ కళ్ళు? ఆ కళ్ళల్ల జిల్లేడు పాలు బొడ! ఆ నోటిల పిడుగులుబడ" అని శాపనార్థాలు పెట్టింది కోడలు.

"ఓలే, నీ కల్లే పోతాయి. నీ నోరే పడిపోద్ది. ముసిల్దాని ఉసురు వొట్టినిపోదు ..."

"నీ కల్లే పోతాయి ...."

"నీ నోరే పడిపోద్ది ..."

"ఒలే ...."  "ఓలోలే ...."

ఇలా ఒకరిమీద ఒకరు పడబోతుంటే ఇరుగూపొరుగూ యిద్దరాడో ళ్ళనీ విడదీశారు. అయినా దూరంనుంచే తిట్టుకోసాగారు. గన్నియ్య పిల్లలు బిక్కుబిక్కుమంటూ తల్లిని చేరారు - యీ గలాటాకు! గబగపా గన్నియ్య భార్యవద్దకు వచ్చి—

"నీకెందుకే బాధ? అడిగినోడ్ని నేను. మద్దికాన నీ తగువేటి?" అని భార్యని గదమాయించాడు.

"నీనేటి నీతోటీ. నీయమ్మతోటీ తగువుకి లాగలేదు. నీయమ్మే నా కన్నోరూసెత్తింది. నా కన్నోరిదేటి తప్పు? నా కన్నోరేటి తక్కువ జేశారు? మీ పాలబడి నా బతుకిలాగయిపోనాది. నీతోటీ. నీయమ్మతోటీ నీను మరి యేగలేనమ్మా ... యేగలేను" అంది నరస.

"యేగలేపోతే.... యెల్లే నీ కన్నోరింటికి. తిందువు కూకోని" అన్నాడు గన్నియ్య విసురుగా.

"ఆలేటి నన్ను పెంచలేరనుకోకు. అలాగే యెలతాన్నే ...." అని పిల్లల్ని తీసుకొని బయల్దేరబోయింది.

"ఎల్లే. ఎవుడ్ని బెదిరిత్తావ్? ఎల్లెల్లు" అని నరస జుత్తును దొరక బట్టుకొని గడపలోంచి బయటికి లాగాడు గన్నియ్య.

నరస "అమ్మో.... ఓలమ్మో" అని రాగమెత్తింది. పిల్లలుకూడా "ఆఁ!" అంటూ యేడుపందుకున్నారు.

"నీకు పిచ్చిగాని పట్టిందా యేటిరా? ఛీఛీ ...యిదేం పనిరా? ఆడ కూతుళ్ళమీద చెయ్యిజేసుకుంతావా? యిప్పుడికే గెంజికి యింత కరువో అంతన్నమా! ఆళ్ళ యేడుపు తగిత్తే.... ఆ గెంజీ దక్కదు" అని గన్నియ్యని తన గడపలో మంచమ్మీద కూర్చోబెట్టి, తిరిగొచ్చి—

"ఒర్రే ఆడోళ్ళా! పల్లకోండి. పల్లకోండి. మరి గోల సెయ్య కండి.... ఇప్పుడికయ్యింది సాల్లు" అని కేకేస్తూ; చుట్టూ జేరిన పిల్లల్ని. వాసలోని జనాల్ని "ఎల్లండెల్లండి. ఎందుకలాగ బొమ్మలాట దగ్గిట మూగి పోయినట్టుగ మూగిపోతారు? ఎల్లండి...." అని తగిలేశాడు.

"నీనేఉన్నాను దద్దా? సూత్తన్నావుగాదా.... ఆ తల్లీకొడుకుల తీరవా..." అని ముక్కుతూ తగువు చెప్పబోతున్న నరసని—

"నోరుముయ్యే సాల్నా ఎల్లు, యింట్లోకెల్లు" అని గదిమాడు. నరస పిల్లల్తో యింట్లోకెల్లింది. ముదరోడు యిటు ముసలిదానివైపు వచ్చి ముసలిదానితో—

"ఔనమ్మా గంగమ్మా! యేటీ అల్లర? యెప్పుడూ లేనిదీ కొసం చుని సావబోయీ ముందేటీ తంటాలు? గంగిగోవునాగ వుండీదానివి.... యిప్పుడేటీ కయ్యాలు? సచ్చేముందు నీకేల యీ పెద్దరికాలు? అలు పోసిందేదో తాగి, పడుండక?" అని కోప్పడ్డాడు.

"నీనేమి పెద్దరికాలు చేసాను? నీనేమి తంటాలు పెట్నాను? నీను కాపురంకొచ్చినకాంచి సూత్తన్నావు. నీనెలాటిదాన్నో నువ్వెరగవా?" అని అడిగింది ముసిల్ది.

"మరెందుకీ గొడవొచ్చిందే....?" అడిగాడు ముదరోడు.

"ఎందుకా? సచ్చినోడితోటి సావకండా వుండిపోనాను కదా! అందుకూ...."

"ఎవులిముండిపోతాం? నువు మాత్రం ఎన్నాళ్ళుండి పోతావు? నువ్వూ సస్తావు...."

"అప్పుడిదాకీ యేడుపు తప్పదు. పుట్టింటినుండి యీ యింటికి కాపరమెప్పుడొచ్చానో.... అప్పుడ్నుంచీ యేడుత్తన్నాను. సచ్చేదాక నాకీ యేడుపే రాసాడు భగవంతుడు...." అని యేడ్చింది ముసిల్ది.

ముదరోడుకూడా బాధపడ్డాడు. పెళ్ళయి. కాపురానికొచ్చినప్పటి నుండీ యీమెని చూస్తున్నవాడు.

చెవులికి కొన చెవికమ్మలూ. కాళ్ళకి కడియాల్తో బొమ్మలాగా వుండేది. చీపురుపుల్లనుంచి సర్వం తెచ్చింది పుట్టింటినుంచి. భార్యా. భర్తలిద్దరూ ఒకనాడు గీసులాడుకోలేదు. కష్టంనాడు. సుఖంనాడు ఒక్కలాగే గడిపారు అయిదుగురు సంతానంకి యిద్దరు చచ్చిపోగా. యిద్దరు కొడుకులూ. ఒక కూతురూ మిగిలారు. కూతురికి మనువిచ్చింది. ఆమెకు కాళ్ళ కడియాలూ. సారెలూ చీరలూ పెట్టింది పెద్దోడు పట్నంల నౌకిరీకి పోగా. చిన్నోడు యింటినీ. యాభయి సెంట్ల మడిచెక్కనీ ఆధరువు చేసుకున్నాడు. ఈనాటికిలాగైంది ఆ తల్లికి!

“నీనేటి నాతోటి కాష్టానికి మోసుకెలిపోతానా? నా తరాత మీకేకద మిగుల్తాయి. నీను బతికుండీదాకయినా నా మూతిమీద గెంజికి అధరువేటి? యీ బంగారం పిసర; ఆ మడిసెక్కే గదా! ఇంతకముసుపు నీ అన్నా యిలగే తనఖా అవి సెప్పి. వొట్టుకెల్లి రెండు కమ్మలమ్మీసినాడు. ఆ వున్నివి నువ్వడుగుతన్నావు నాగ్గానీ. మీగ్గానీ యివేగదా ఆధరువు. ఈట్ని సెల్లుజెయ్యొద్దు. నీనివ్వనన్నాను అంతే. మొగుడూ. పెళ్ళాం యేకమయి నానా మాట్లాడినారు. ఆకరికాడు పిడిగుద్దులు గుద్దీసినాడు.... పేణం కడారి పోయినట్టగ!” అని మూలిగింది ముసిల్ది.

ముదరోడు “ఇదా సంగతి!” అని ఆశ్చర్యపోయాడు.

“యేడకు. మరేడకు. పల్లకో. యేటి జేత్తాం? కరువుకి తల్లీలేదు పిల్లాలేదు. కటికోలయిపోతన్నాం. ఇంతో. అంతో పంట పండినోలిమి మా యింటిలే గుద్దులాడుకుంతన్నాం. దరిద్రమలగ సేత్తాది రా.... రా: యివేల్టికి మా యింటిల తివి. తొంగో....” అని తీసుకెల్లాడు ముదరోడు. గడపలో మంచమ్మీదున్న గన్నియ్య - తల్లిని చూసి. లేచి యింటికి వెళ్ళబోయాడు. ముదరోడు గన్నియ్యని ఆపి—

“ముసిల్దాని కొనసెవికమ్మలడిగినావటరా....?” అన్నాడు.

గన్నియ్యకు ముదరోడు మామ అవుతాడు వరసకి. ఆ వరసతో.

“ఔను మాఁవా, అడిగినాను. నువ్వెరగవేటి కరువుకి బతుకులెంత కష్టంగున్నాయో? విరుడు మడుపులు దండుగయిపోనాయి. ఒక్క గింజ పండనేదు. మడుపులికి వోడుకున్న అప్పు వొడ్డీతోటి తడిసి మోపుడయిపోనాది ఇంటిలా.... ఒక్క గింజనేదు. కూల్లేనా దొరకటంలేదు. ఉన్నకాడకి నీ కూతురొంటిమీది పుస్తెలూ; యింటిలోవి కంచు మూతలూ. గిన్నిలూ అర్పీసి. తినేసినాం. ఇలగెంతకాలం తింతాం? ఎక్కడ తెత్తాం?

ఆ మడిసెక్కల.... సత్తికం పంట యేసినాను. అవి పండితే మల్లా సారవా పంటొచ్చీదాక తిండికి సరిపోతాయి. బోడిబాబుగారి బోరు నీరు యిత్తంద్రు. ఈ సూరిబాబుకాడ పుట్టిడిత్తనాలు.... పాయిదాతోటి రెండొందలు యివ్వడానికి ఖండనకింద వోడుకున్నాను. సేను బాగా పెరిగింది. యింతలోకి— ఎరువులెయ్యక ఎర్రగయిపోతంది. ఎర్రగయిపోదంకాక. సుంకి పోటొచ్చినట్టగుంది పురుగుపట్టీసి. పురుగులమందూ. ఎరువుమూటా ఎయ్యకపోతే ఆ సేను మరి పండదు. యింత మడుపూ. యిన్నాళ్ళ కష్టిమూ బుగ్గిల పోస్పినట్టే. పురుగులమందూ. ఎరువులమూటా కొనాల!

అమ్మా! తల్లే....! పరిస్థితి యిదీ. ఆ రెండు కొనసెవికమ్మలియ్యే అన్నాను దానికి యింత జరిగినాది మాఁవా. యిదీ నా బతుకు. ఇంటిల గడదు. యీదిల గోల! యీ బతుకు బతనేను మరి. సవ్వడమే నయి మనిపిత్తంది....” అని యేద్వసాగాడు గన్నియ్య.

ముదరోడు గన్నియ్య భుజమ్మీద చేయివేపి నిమురుతూ—

“ఛఛ... అవ్వేం మాట్లురా. సచ్చి యేటి సాధిత్తావురా? ఈపాటి దానికే మనసిరుసుకుంతే ఎలాగరా? యిలాటి కష్టాలు. యిలాటి కరువులూ ఎన్నో సూసుకొచ్చినాం మీము. పిల్లాజెల్లా.... కూటమాంలు పెంచుకొచ్చినాం. నీ తండ్రి సంగతో....? ఎన్ని బదవలు సేసాడు? అలగే... గట్టెక్కినాడు. ఈ కరువులేటి సెయ్యిలేకపోనాయి మాకు.

అయితిపుడొక తీరు... అప్పుడొక తీరనుకో. ఇపుడు సరుకులు వుంతన్నాయి. అయితే అట్ని దాసెత్తను. ధరలు పెంచీసి మన్నాటోల్ని సంపుతను. సూరిబాబుకాడ ఈ ఊరిలాటివి నాలుగూర్లు తిన్నా తరగని ధాన్నెమున్నాయి. అడిగితే.... అంతకంతా ధరంతాడు. అప్పుకిందయితే అయివేజడుగుతాడు. మనల్ని అమిర్చేత్తాడు.

అప్పుడలాక్కాదు. సరుకుల్నేక కరువొట్టిపోయీ వోలిమి. ఉంతే ఊరంతా సర్దుకుని బతికీవోలిమి ...” అని చెప్పాడు ముదరోడు.

“ఈ రోజుల్ల ఎవులికెవులు మామా? సూరిబాబు గడపెక్కితే పాత అప్పో ...? అంతుంతాడు. ఎలగసచ్చీది పిల్లల్తోటి?” అన్నాడు గన్నియ్య

“ముసిల్దానికి నీను సెప్తాన్లే. నువ్వింక బెంగబెట్టుకోకు. ఎల్లు మేఘాలెత్తినాయి. వొర్పమొత్తాది గావాల!” అని పంపాడు గన్నియ్యని ముదరోడు.

* * *

మర్నాడు పొద్దున్నే గన్నియ్య సూరిబాబు డాబా ఇంటికి వెళ్ళాడు. సూరిబాబు ఎలుకల్ని ఎక్కువగా తిన్న పిల్లిలా బలిష్టంగా వుంటాడు. శరీరమంతా ఎర్రగావుండి. దట్టమైన నల్లని వెంట్రుకలు.... యేటి ఒండ్రునేల మీది మొక్కల్లా వుంటాయి. గుబురు మీసాల్తో మీదిపెదవి కప్పబడి వుంటుంది. సూరిబాబు మాట్లాడితే.... గుబురు మీసాల్తో కదిలే పై పెదవి ... యేదో జంతువు నోరు తెరిచినట్లుంటుంది.

గన్నియ్య కన్పించగానే.... సూరిబాబు నోరు తెరుచుకుంది.

“రాత్రేటిరా.... మీ ఇంటిల గొడవ?” అని పరామర్శించాడు బాబు

గన్నియ్య జరిగింది చెప్పి; చేతిలో చెవికమ్ముల్ని అందిచ్చి—

"బావో ... యివి అర తులముంతాయి. మా అమ్మవి. దాని పేణాలు తెచ్చినంత కస్టమయ్యింది. ఈట్ని తనఖా వుంచుకొని ... ఒక మూట ఊరియా (యూరియా); ఒక డబ్బా పురుగులమందూ యియ్యి" అన్నాడు.

"మరేటొద్దా?" హేళనగా అడిగాడు సూరిబాబు.

గన్నియ్య బిక్కమంటూ సూరిబాబుని చూడసాగాడు.

"లేపోతేట్రా? యివి అర్తులముంతాయా? ఎప్పుడో తాతల్నాటి వొస్తువులు. ఆటికి రామీ ఎంత పోద్ది? రామీ పోగా మిగిలిందెంత? దాని ఖరీదెంత?" అని ప్రశ్నించాడు సూరిబాబు.

"ఆవేటి.... అమ్మకానికి కాదు బావ్. తనకాకి...." అన్నాడు గన్నియ్య ఆందోళనపడ్తూ.

"తనకాకే అనుకోరా. దానికిమాత్రం విలువకట్టొద్దా? రేపు నువ్వు విడిపించకపోతే. నీ బాకీకి ఆ వస్తువు కిమ్మత్తివ్వాలా?" అడిగాడు సూరిబాబు.

"దేవాంతకుడివి బాబూ ..." అనుకున్నాడు మనస్సులో గన్నియ్య బయటికిమాత్రం—

"ఇడిపించపోతే ... మా యమ్మ నన్ను తినీదా?" అన్నాడు.

"మీరందరుగలిపి నన్ను తినీపినట్టగుంది. కిందఏడిచ్చిన అప్పు అలగ కిందనిబడిపోనాది. దాని కొడ్డీలేదు. అసలూ రాలేదు...."

"నీ దగ్గర తీసికున్న అప్పు అలాగ మదుపే ఎట్నాను. అంద లొక్క పైసా తిండికి వోడనేదు. పొలంమీదే పోస్నాను. వార్నాల్లేక పంట పోనాది. కరువొచ్చింది. నీ యప్పుండిపోనాది ..."

"మళ్ళా కొత్తగ పుట్టిడి త్తనాలొట్టుకెల్లావు. దానికీ పంటలే రావాలంతన్నావు. యిప్పుడు మళ్ళా ... ఎరువు బస్తా. పురుగులమందు డబ్బా యిమ్మంతన్నావు. ఇలాగ.... ఊరందరూ నా మీదపడి దూసుకుతినీత్తే ... నీనెక్కడ్నుండి తెత్తానురా? అఁ?" అని నోరు తెరిచాడు సూరిబాబు. గుబురు మీసాల్తో గుహలా తెరుచుకుంది!

ఆ గుహలోకి ఊరి రైతుల బంగారు. వెండి నగలూ. భూమీపుట్టా చాలావరకు వెళ్ళిపోయాయి. గన్నియ్య గుహ ముఖద్వారంలో విలుచున్నాడు

నువ్వంలగనీత్తే ఎలాగ బావ్? కరువు కదా! కపింత కనికరించాల గానీ...." అని బ్రతిమాలాడు గన్నియ్య.

"కనికరించడంకి సొమ్మురా ... సొమ్ము! నా దగ్గిరుండొద్దా? నీనేటి గవర్మెంటునా? కావలసినప్పుడల్లా నోట్లు ముద్దరగుద్దీపిచ్చీడంకి...." అన్నాడు నవ్వుతూ సూరిబాబు. నవ్వుకి శరీరమంతా కదిలింది. కూర్చున్న పట్టెడ మంచం అల్లాడిందొక్కసారి.... డొంకల్లో జంతువు కదలికకి డొంక అల్లాడినట్లు!

"గవర్మెంటుమాత్రం మాలాటోలికిచ్చెత్తందేటి? కరువుకి భయపడిపోకండి. బాధపడకండి.... అన్నారు. ఊరూరా తిరిగారు కరువుమంత్రీ. మండల మధికారులూ! ఇత్తనాలన్నారు. ఇన్సూరెన్సన్నారు. అప్పులు రద్దన్నారు. కరువు పనులన్నారు. అవన్నారు. ఇవన్నారు. ఏవీ? యేటినేవు? యెవులూ కనబడ్రు. మా ముదుకు నత్తువే మాకు ఆధరువయ్యింది ...." అని జవాబిచ్చాడు గన్నియ్య?

"గవర్మెంటుమాత్రం ఎక్కడనుండి తెత్తాదిరా.... అందరికీ సంతర్పణ పెట్టీడంకి? ఎవుడి తిండి అడు సంపాదింతుకోవాలగానీ...." అని హితబోధజేస్తూ. ప్రజల ఆహార. వసతి సమస్యలకు ప్రభుత్వానిది బాధ్యత కాదన్నారు సూరిబాబుగారు సూటిగా.

నిజమే. ఎవరి తిండి వారే సంపాదించుకోవాలి. మేకలు తమ ఆహారాన్ని తామే సంపాదింతుకోవాలి. ఆకులలములు ఏరుకోవాలి. ఆకలి మేకలు ఆకులు యేరుకొని తింటాయి. కానీ మేక.... పులికంటబడితే....? పులి ఆకలి తీరిపోతుంది మేక ఆహారప్రయత్నం విఫలమవుతుంది. పులీ. మేకలకి ఒకటే శాసనమున్నపుడు ... మేకలు ఆకలితో వుంటాయి. లేదా పులులకు ఆహారమవుతాయి. మేకల శోకాలు వినేదెవరు....?

గన్నియ్య ఆకలి యేడ్పు యేడుస్తూ—

"నిజమేవి బావ్. నా తిండి నీనే సంపాదించుకొంతాను. అయితది నా నోటికి సేరీసరికి ఎగిరిపోతంది. మా యింటి పిల్లాది మొదలు కస్టబడతాం కడుపుకింత గెంజికోసమే. అయినా ఆ గెంజే దొరక్కంటంది...." అన్నాడు.

"ఆదే రాతరా.... తలరాత! తలరాతలగున్నన్నాళ్ళు నువ్వెన్ని జెయ్యి ... నీకు కరువు తప్పదు. కస్టాలు తప్పవు. దేవుడికే తప్పిందిగాదు మానవులిమి మనకి తప్పుతాదే? అయివోద్యా నగరంల. సింహాసనం మీదుండవొల్సినోడే అడివిలు పట్టీసినాడు. అడ్డమైన పాట్లూ పడ్డాడు"

"యెన్ని పాట్లు పడినా. ఆకరికి అయివోద్య వొచ్చీసినాడు. సింవాసనం ఎక్కీపినాడు గదా...." అన్నాడు ఉత్సాహంగా గన్నియ్య.

"దేవుడుగాబట్టి తట్టుకున్నాడు. మనకీ పాట్లు తప్పవు...." అని తేల్చి చెప్పాడు.... తప్పవు బాధలని సూరిబాబు.

"మరందికనే. దేముడినాగ తమరే ఆదుకోవాల. సత్తికం పంటేనా పండితే పిల్లల్తోటి యింత గెంజి తాగి బతుకుతాం...." అని బతిమాలాడు గన్నియ్య.

"పాత అప్పులు పాతరేసిత్తుంతే.... కొత్తవెలాగిత్తానురా?"

"ఆ బంగారమ్మిదియ్యి బావ్...."

"మరి పాతబాకీ సంగతో....?"

"పంటలానీ తీర్పేత్తాను ..."

"వొత్తాయని గేరంటేటి? అలాక్కాదు. ఒక పనిజెయ్యి. నీకూ సులువు. నాకూ హామీ వుంటాది...." అన్నాడు సూరిబాబు.

"యేటి బావ్...." అడిగాడు గన్నియ్య.

"ఈ వొస్తువులు అరతుల మంతన్నావుగదా? రామీ. గీమీ కొట్టీపి ఖరీదు గడుదుము. కిందటేడు నువ్వోడుకున్న వెయ్యి రూపాయలూ. ఫాయిదా కలిపి లెక్కేసి దానికి యివి జమజేపిద్దుం. ఆ బాకీ సెల్లిపోద్ది.

ఇక. కిందటిసారి వొట్టికెల్లిన పుట్టిడి త్తనాలూ. ఆటి ఫాయిదా-యిప్పుడు నువ్వడుగుతున్న ఎరువుమూట. మందులడబ్బా ఖరీదూ కలిపి

లెక్కతేలద్దుం. అంతా కలిపి- ఆ డబ్బుకి నీ మడిసెక్క బోగబందకింద నోటు రాపియ్యి. ఇలగైతే నీకూ పాత అప్పు వుండదు. సత్తికానికి ఎరువూ దొరుకుతాది నాకు పాతది వసూలైనట్టూ వుంటాది. కొత్తఅప్పుకీ హామీవున్నట్టూ వుంటాది. యేటి? ఈ సత్తికం పంట పండించుకో. ఆ తరవాతే ఆ మడిసెక్క నాకు బోగబందకింద స్వాధీనంజేసీ యేటంటావు? అలగైతే యేదో నువ్వడిగినివి సూత్తాను .. '' అన్నాడు సూరిబాబు.

''బాబ్బాబూ! మాయమ్మ యీ బంగారం పినర యివ్వడానికే చచ్చి సావయ్యింది. అవీ తనకాకిచ్చింది. ఇకా మడిసెక్కంటావా? అది దాని పేణం! మా అయ్య సచ్చీముందు దాని పేర్న రాయించినాడు. మాయమ్మ వొప్పుకోదు బావ్....'' అన్నాడు గన్నియ్య.

''అయితే. నాకు అప్పులొదిలీమంటావా?''

''ఇంతవరకి ఆగినావు. వొచ్చీ సారవపంటకి నీ బాకీ పూరాగా తీర్పేత్తాను బావ్. ఇప్పుడు నన్ను కనికరించు'' బతిమాలాడు గన్నియ్య.

''అలాగ సెప్పే అప్పుడొట్టికెల్నావు ఆ సారవా పంట పోనాది. వొచ్చీ సారవా పంట మాత్తరం వొత్తాదని నమ్మకమేటి? పోని. అంత నమ్మకమున్నోడివి ... నీక్కలిగిన్నాడు నీ మడి యిడిపించుకో. నీను యివ్వనంతానేటి? నాకేల మీ మడిసెక్కలు? రేపు అప్పు తీర్పి నీ బోగ బంద పత్రం పింపీసి. నీ మడి నువ్వు దున్నుకోవచ్చు. యేటి? అలగ సెయ్యి. ఎల్లు మీ అమ్మని తీసికిరా బోగబంద పత్రం రాయించి వుంచు తాను. ఏలిముద్రెట్టించుదాం.'' అని చెప్పి. వెళ్ళమన్నాడు గన్నియ్యను సూరిబాబు.

గంపెడు విచారంతో వెనుదిరిగాడు గన్నియ్య. తిన్నగా పొరుగింటి ముదరోడింటికి వెళ్ళాడు ముదరోడు. ముదరోడి పెద్దకొడుకు నర్శింహులూ వున్నారు. గన్నియ్య విషయమంతా చెప్పాడు.

''హమ్మ! గాడిదకొడుకు. సరిగ్గా దొరికావని సప్పరిచ్చీదంకి సూత్తండన్నమాట. ఆడి దురాశ అంగసెల్లిపోతంది. ఈ కరువు మరింత పనికొచ్చినట్టగున్నాదాడికి. ఉన్నకాడికి నొల్లుకుంతండు. వొద్దొద్దు ఆడికి మడిచెక్క అమిర్చీకు. తిన్నగ నీ బంగారం నీకిచ్చీమను. బేంకీల తనకా బెడుదుం. ఆ డబ్బుతోటి ఎరువులవీ కొనుక్కో....'' అని మార్గం చెప్పాడు నర్శింహులు.

''మరా సూరిబాబుకివ్వాల్సిన అప్పో?'' అన్నాడు ముదరోడు సాలోచనగా.

''తీరుత్తాడు పంటలొత్తే ... నోటు రాపిచ్చేడుగదా?'' అన్నాడు నర్శింహులు.

''అతగానొప్పుకోవాలా? చేతిల దొరికాడని యిటు బంగారమూ. అటు బంగారంలాటి మడిసెక్క నొల్లిద్దమని అతగాను సూత్తుంతే.... వొప్పుకుంతాడా? బంగారం తిరిగిత్తాడా?....'' యివ్వడని తేల్చాడు ముదరోడు.

''అడూ. అడి జేజమ్మ యిత్తారు. పదా. నీనొస్తాను ఎలగివ్వడో చూస్తాను....'' అని లేచాడు నర్శింహులు.

''నీదంతా దురితమేస్రా. సూరిబాబంతేటి.... పిన్న పిన్నోడను కుంతన్నావేటి? ఆడి మాటకీ. చేతకీ ఎదురులేదు. నీకు తెల్దూరుకో....'' అని ఊరుకోమన్నాడు కొడుకుని ముదరోడు.

''ఇలాగ భయపడే మనూరిల అందరు రైతులు ఆ సూరిబాబుగాడికి అమిరిపోతన్నారు. ఇలాటి సూరిబాబుల్లాటి బాబుల్ని మా తాతగారూరిల, మా సంగంముందు లొంగదీస్నాం ...'' అన్నాడు గర్వంగా నర్శింహులు.

''ఆఁ! లొంగదీసారు. లొంగదియ్యడం. ఇంతజేసి. యిప్పుడే టయ్యింది అక్కడ అడ్డమైన కేసులూ వున్నాయని. ఆ తాతగారే తగిలీపి నారు నిన్నిక్కడికి నువ్వూరుకో. మరిందల దూరకు ఇక్కడా గొడవలు తేకు నాల్రోజులు సల్లగుండు '' అని కొడుకుని చల్లబరిచాడు.

నర్శింహులు చిన్ననాటినుండీ తాతగారి ఊరిలో బ్రతికాడు. ఈ మధ్య ఆ గ్రామంలో పేదలకూ. భూస్వాములకూ మధ్య ఘర్షణలు జరగ టం. సంఘం తరఫున పేదలవైపు నర్శింహులు దృఢంగా వుండటంతో కొన్ని యిబ్బందులకు గురైనాడు కొన్నాళ్ళు స్వగ్రామంలో వుండిరమ్మని తాతగారు బలవంతంగా యీ ఊరు పంపించారు. నర్శింహులు ఇక్కడున్నా తన ఆలోచనలూ ఆచరణా మార్చుకోలేదు.

ముదరోడికి అందుకనేమో భయంపుట్టి. నర్శింహుల్ని జోక్యం చేసుకోవద్దని చెప్పి; గన్నియ్యతో—

''అయ్యా గన్నియ్యా. ఈడి మాటల పెకారం యీ ఊరిల సాగ లేం. ఆల తాతగారూరా....? అలవాటుబడిపోనారు. అందరొకటయినారు. అక్కడేదయినా సెయ్యొచ్చు. ఇక్కడలాగ్గాదు. అందికనీ నువ్వే సెప్పు. యేటి సులువు? యేటి సేద్దమంతావయ్యా?'' అని అడిగాడు.

''ఆదే బోదపడ్నేదు మాఁవా! పోనా బాబు అన్నట్టుగే సేద్దమంతే మాయమ్మ వొప్పుకుంతాదా? బంగారంకే రాత్రి ఎంత గోల పెట్టేసిందో సూపినావు కదా? పోనీ. పల్లకుందుమంతే ... పంట పోతాది? మాకు తిండికి మళ్ళా సారవపంటదాక ఆదే ఆధరువు....'' అన్నాడు గన్నియ్య.

''సూద్దుం. సాయింత్రం మీ యమ్మకి నచ్చజెప్తాను. యేటి? అంతకి మరి మార్గం నేదు. నీను సెప్తాన్నే'' అని ధైర్యం చెప్పాడు ముదరోడు. గన్నియ్య దీర్ఘంగా ఆలోచిస్తూ. మౌనంగా ఇంటికెళ్ళాడు.

* * *

సాయంత్రం — పొద్దు పడమర కొండల్లో మునిగిపోయింది. ఊరిలో చీకటి పరుచుకుంటోంది. ఇళ్ళల్లో పొయ్యిల మంటలూ. కిరస నూనె దీపాలూ వెలుగుతున్నాయి. కరెంటులేక వీధిలైట్లు వెలగలేదు.

సాలలో పశివిలికి గడ్డివేసి గన్నియ్య ఇంటికొచ్చాడు. భార్య వంట పంచలో పొయ్యిదగ్గర కూర్చొని. చంటోడికి చనుబాలు పెడ్తోంది.

''మాయమ్మెక్కడి కెల్లిందే? కనబడలేదు....'' అని అడిగాడు భార్యను గన్నియ్య తల్లినిగూర్చి.

"ఆదేమో. ఎటెల్లిందో? ఎవులికి తెలుసు? మీయమ్మేటి నాకు సెప్పియెల్తాదే? నువ్వు నాకేటి మీయమ్మకి కాపెట్నావా?" అని ప్రశ్నించి పొయ్యిలోకి పుల్లలు కదిపింది.

"తంతే ...తాపుకి పొయ్యిల బడుదువే! నీనడిగిందేటి? నీ పేరుపు లేటి? నోరు తగ్గించే ... తగలగలవు దరువులు...." అనేసి. ఇంట్లోంచి బయటికొచ్చాడు గన్నియ్య ముదరోడింటికెళ్ళాడు. అక్కడా తల్లి లేదు.

"సీకటి సీకటవుతుండగొచ్చింది. నీను సెప్పాల్సిందంతా సెప్పాన్రా పల్లికే యిన్నాది. యినీసి, ఒక పిటముండి యెలిపోనాది. తిరిగి మీ ఇంటికి రానేదా?" అనడిగాడు ముదరోడు.

"లేదు. రాలేదు" అనేసి. ఆక్కడ్నించి ఊరిలోకెళ్ళాడు గన్నియ్య ఎటు వెళ్ళిపోయుంటాదీ? అని ఆందోళన పడసాగాడు। ఊరంతా తిరిగే సినా. ఎక్కడా కనబడలేదు. ఊరికొసాని, చందకవీధి పెరడునుండి తిరి గొస్తుండగా, ముదరోడి పెద్దకొడుకు నర్సింహులు కన్పించాడు.

"యేటీ? మీయమ్మకోసం యెదుకుతన్నావా? కనబడ్డాది. కనబడ్డాది ఇందాక నీను గడ్డికుప్పకాడ కొత్తన్నాను మీ ముసిల్ది ఊతకర్ర పట్టుకొని యీ చందకీధి పెరటెల్లి యెల్తంది. మడికాడ నువ్వున్నావేటో, నీకోసం గావాల యెల్తందని అనుకున్నాను ..." అన్నాడు తలమీద గడ్డిమోపుతో నిలబడి - గన్నియ్యతో.

"మడికాసే ..." అని మడివైపు గన్నియ్య వెళ్ళబోతే—

"ఉండుండు. గడ్డిమోపు సాలలబడేసి. టార్చిలైటొట్టుకోనొత్తాను" అని పరుగూ నడకన వెళ్ళాడు నర్సింహులు.

అట్నించి నర్సింహులు - టార్చ్ లైటుతోనూ. వెనక ముదరోడు హరికేన్ లాంతరుతోను; మరో యిద్దరు ముగ్గురు మనుషుల్తోనూ వచ్చాడు

అందరూ గన్నియ్య మడిచెక్క దగ్గరికి చేరారు.

"అమ్మా! ఓలమ్మా!" అని గన్నియ్య కేకలేసి పిల్చాడు.

"అమ్మీ గంగమ్మా?" అసి ముదరోడూ పిల్చాడు. జవాబు లేదు. గన్నియ్య గట్టుదిగి మడిలోకి నడిచాడు. మడినీరూ. బురదా చిక్కగా కలిసిపోయి కాళ్ళు దిగిపోతున్నాయి. తపక్ తపక్‌మని బురదలో కాళ్ళు వేస్తూ. కలియతిరిగాడు గన్నియ్య.

మడి మధ్యలో ముసిల్దాని ఊతకర్ర పాతేసివుంది దానికి చేరబడి ముసల్ది కాళ్ళూచేతులూ మడిబురదలో పాతేసుకుంది.

"ఈ నేల నాదీ...." అన్నట్లుగా నేలలో కాళ్ళూ చేతులూ దూర్చి హక్కుని ప్రకటించి శ్వాస విడిచినట్లుంది. ఊతకర్రకు ఆన్చి.... తల వాల్చి వుంది ముసిల్ది!

గన్నియ్య గుండెలు లయదప్పినాయి. కాళ్ళూచేతులూ వొడికి పోయాయి. గర్సింహులూ. ముదరోడూ. మిగిలినవారూ గభాల్న చేరారు.

"హన్నన్నా! ముసిలిదాయి ఎంత పనిజేసింది...." అన్నాడు ముదరోడు బాధగా.

"నా తల్లిని నీనే సంపేసినాను. నీనే సంపేసినాను. ఈ నేల దాని పేణం. ఈ నేల నడిగాను" అని గన్నియ్య గుండెలవిసేలా యేడుస్తూ. బురదలో కూరుకుపోయిన తల్లి కాళ్ళూచేతుల్ని బయటికి లాగాడు. తల్లిని భుజమ్మీద వేసుకున్నాడు.

నర్సింహులు టార్చిలైటు దారివైపు వేస్తూ—

"కొసకి మనకీ చావులే మిగల్తాయి మరి. ముసిల్ది చచ్చినా భూమి వదలగూడదని చెప్పింది ఇది ముందే బోధపడ్డేదు నీకు. కన్నతల్లిని పోగొట్టుకున్నావు ఉన్న నేలతల్లిని తన్నుకుపోడంకి సూరిబాబు సూత్త న్నాడు. ఎందుకు మనమిలగయిపోతన్నామో. ఎవులు మన బతుకులికీ రాత రాత్తంద్రో.... యిప్పుడికేనా బోధపర్చుకో...." అన్నాడు నర్సింలు.

"బోధపడ్నాది నర్సింలో బోధపడ్నాది. సావుకోర్ల ఉరులూ. గవి ర్మెంటు గాలికవుర్లూ... యెలాగ మనల్ని యీదిపాలు జేత్తాయో. యెలాగ మనకీ సావుల్నీ. సంకటాల్నీ మిగులుత్తాయో బోధపడ్నాది. నన్ను కనీ పెంచిన తల్లి - కళ్ళుమూస్సి - నా కళ్ళు తెరిపించినాది. మన్లాటోల సావులూ సంకటాలూ పోవాల! అదిగో. అవి పోడంకే యికబట్టి బతుకుతాను" అని దృఢంగా పలుకుతూ. గన్నియ్య తల్లిని భుజమ్మీద వేసుకొని; నర్సిం హులు చూపించే లైటు వెల్తురులో ఊరివైపు నడిచాడు. ★

---

## ఆగష్టు పదిహేను

ఆగష్టు పదిహేను అర్ధరాత్రి నా నేత్రాలు నిద్రపోవు
ఈ క్షణంలోనే హంతకులు
బురిఖాలు వొలిచి జెండాలు కడతారు
'సారే జహాఁసె అచ్ఛా' దొంగ శోకాలు పెడతారు
ఈ క్షణంలోనే
శరీరం అశరీరమై. అకలే శరీరమై
దేశమంతా నల్లగా మాట్లాడే ప్రజలకు సంకెళ్ళు బిగిస్తారు.
ఈ క్షణంలోనే మేల్కోవాలి
పులితాములు వేడి నెత్తురు వొలికిన ఈ తీక్షణంలోనే మేల్కోవాలి
ధర్మానుసారం వాలుతున్న
రెప్పలకు కపిదేరిన బాణాలు గుచ్చి మేల్కోవాలి
వొలికిన నెత్తుర్లోంచి నినాదం.
మిలియన్ల ప్రజల కంఠాలు చేరి పగులుతున్న నినాదం.
'యుద్ధవీరులు మృత్యుంజయులు' నినాదం
నినాదం.... ... నినాదాల్లోంచి నినాదం
నినాదాల్లోంచి ........మళ్ళీ.... యుద్ధవీరుల జననం
తప్పుకోండి తప్పుకోండి
నా ప్రియాతిప్రియుని యుద్ధరంగ ప్రవేశం చూడాలి రాయాలి పాడాలి
ఆగష్టు పదిహేను అర్ధరాత్రి నా నేత్రాలు నిద్రపోవు.

—సూర్యం